రామ్‌కీ కల్చరల్ ఫౌండేషన్ - నవ్యవీక్లీ
దీపావళి కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# పెళ్లిషరతు

**తా**డో పేడో తేల్చుకొని, మధ్యాహ్నం భోజనం వేళకు తిరిగొస్తానని పొద్దుటనగా ఊరెళ్లిన మనిషి, పొద్దుగుంకే వేళవుతున్నా తిరిగి రాక పోవడంతో యశోదమ్మ మనసులో అశాంతి క్షణాక్షణానికి పెరిగిపోసాగింది. ఆశ నిరాశల మధ్య మనస్సు అదే పనిగా కొట్టుకులాడసాగింది. ఈ సారన్నా చల్లని కబురు తేవాలని పేరు పేరునా దేవుళ్లకు మొక్కసాగింది.



ఐదారేళ్లబట్టీ ఎన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నా ఏ ఒక్కటి ముడిపడలేదు. అంతా సానుకూలంగా నడుస్తున్నట్టు కనబడటం, చివరకు ఏదో వంకతో బెడిసి కొట్టడం

మామూలైపోయింది. కాలం గడిచేకొద్దీ కాళ్లూ చేతులాడటం లేదు. ఏ వయస్సుకాముచ్చట అనుకునే రోజులు పోయాయి.

ఒకప్పుడు ఆడపిల్లల్ని గన్న తండ్రులు పిల్లల పెళ్లిళ్లు చెయ్యటానికి కాళ్ల చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలుంటే, అయ్యో! వీళ్లనెట్టా యిరగడ చేస్తారో పాపమని జాలి పడేవాళ్లు. ఇప్పుడా పరిస్థితి మగపిల్లల విషయంలో దాపురించినట్లుంది. ఆడపిల్లకి తృణమో పణమో ఇచ్చి ఒక అయ్య చేతిలోపెట్టి పంపటం ఇవ్వాళ ఎంతో తేలిగ్గా వుంది. కట్నం అంతగావాల, ఇంత గావాల, అదిపెట్టాల, ఇవి పెట్టాలంటూ గొంతెమ్మ కోర్కెలు కోరేదానికి లేదు. అసలు పిల్లనిస్తామంటే చాలు మహాభాగ్యం అనుకొంటూ వున్నారు.

అదే మగ పిల్లాడయితే, ముందు వాడి కాళ్ల మీద వాడ్ని నిలబెట్టి చూపాలి, ఆనక పెళ్లి పీటల మీద కూచో బెట్టాలి. రెండూ చక్కబెట్టుకొని రావటం పెద్ద గగనమైపోతుంది. రుక్మిణి పెళ్లి విషయంలో ఏం జరిగింది? పిల్లకు పదహారేళ్లు నిండిన కాడ్నించి, మా పిల్లోడికి చేసుకొంటాం, మా పిల్లోడికి చేసుకొంటామంటూ ఇంటి మీదకు ఎగబడ్డారు. పద్దెనిమిదన్నా నిండకుండా పెళ్లేందంటూ పడనివ్వలేదు. పోనీ అప్పుడే చేద్దాం, మాటిమ్మంటూ పీకల మీద కూచునేవాళ్లు. సర్దిచెప్పలేక తల ప్రాణం తోకకి వచ్చేది.

ఇక పిల్ల పెళ్లి చేద్దాం అనుకోవటం ఆలస్యం, ఇంటి ముందు వరుసగట్టారు. కట్నకానుకల పట్టింపే లేదు, పిల్లను బంగారంలా చేసుకుంటామంటూ వియ్యానికి పోటీపడ్డారు.

ఒక్కడే కొడుకు, బుద్ధిమంతుడు, పాతికెకరాల వ్యవసాయం, పాడిపశువులు, ట్రాక్టర్, లంకంత ఇల్లు. అంతకన్నా ఏం కావాలి పిల్ల సుఖపడటానికి అనిపించింది. పిల్లకు నాలుగెకరాల పొలం, తాహుతుకు తగ్గట్టు లాంఛనాలు జరిపిస్తామంటూనే రెండోమాట మాట్టాడకుండా ఒప్పేసుకున్నారు. పిల్ల అదృష్టవంతురాలనుకొన్నాం. పెళ్లయి ఐదారేళ్లయింది. ఇద్దరు పిల్లలు. ఆడపిల్ల గురించి ఆలోచించాల్సిన పనేం లేదు. ఏం లోటు లేకుండా బతుకుతోంది.

అసలు ఇప్పుడు దిగులంతా ఒక్కగానొక్క కొడుకు కాంతయ్య గురించే. తొందరపడే కొద్దీ వెనక్కి పీకటం ఎక్కువైంది. పిల్లాడికి ఏం తక్కువని? కురూపా? కుదురు లేనోడా? పనీ పాట చేతరానోడా? గాలికి తిరిగే వాడా? ఊళ్లో బిడ్డగురించి ఒక్క చెడ్డమాట అనుకుంది లేదు గదా!

"పిన్నాం! నాగయ్య బాబాయి లేడా!" అంటూ భూషణం రావటంతో యశోదమ్మ ఆలోచనలకు గండి పడింది.

"లేదయ్యా! ఏదో కాస్త పనుండి నూతక్కి బొయ్యాదు. ఈ పాటికి రావాల్సిందే మరి.... రా ఇట్టా కూచో, పోదువుగాన్లే" సాదరంగా పిల్చింది.

మాసిన తల, పెరిగిన గడ్డం, నలిగిన బట్టలు పిచ్చి వాలకంగా వున్నాడు. నెలలు గడుస్తున్నా మనిషింకా దిగుల్నుండి బయటపడ్డట్టు లేదనుకుంది. చేతికొచ్చిన కొడుకు అకాలంగా పోతే ఏ తండ్రికి మాత్రం గుండె ముక్కలవకుండా వుంటుంది? బిడ్డకు ఏ రోగమో వచ్చి పోవటం వేరు, చేతులారా పేణం తీసుకోవటం వేరు! కాంతయ్యకన్నా నాలుగైదేళ్ళు పెచ్చు వయసుంటదేమో! అర్ధంతరంగా పోయాడు.

"ఏయ్యా! తొందర పనేవన్నా వుందా?" ఆరాగా అడిగింది.

"మరే పిన్నాం. నాలుగేలు చేబదులడుగుదామనొచ్చా".

"అదెంత భాగ్యంలే! భోజనం వేళకే వస్తానన్న మనిషి".

"ప్రయాణాలన్నాక మన చేతిల్లో ఫనంటలే! వేళకు బస్సులంది, సమయానికి అవతల కలవాల్సిన మనుషులుండప్పటి మాట గదా!" అన్నాడు భూషణం.

"అదీ నిజమేగా!"

"కాంతయ్యా లేనట్టుందే?"

"గొడ్లకు పచ్చగడ్డి కోసుకురాను బోయాడయ్యా! వచ్చే వేళయింది" యశోదమ్మ.

"గాదెల్లో ధాన్యం నిలవబోసుకొని అప్పుకోసం చేతులు జాపాల్సి వచ్చింది. ఒకప్పుడు పంటలొస్తే పదో పరకో దబ్బాదుతుండేది. ఇప్పుడేమో, పండించిన పంటలు కొనే దిక్కులేక బతుకులు బజార్న పడుతున్నాయి". భూషణం మాటల్లో పుట్టెడు దిగులు.

"ఎంతెక్కువ కష్టపడితే అంతెక్కువ నష్టం మూటగట్టుకోవటంలాగుంది మన రైతుల పని. కిందటేడు వెయ్యిలెక్కన అమ్మిన ధాన్యం ఇయ్యేడు ఆరొందల్లెక్కన కూడా కొనే దిక్కు లేకుండా పోయే! నాలుగెకరాల పంట నిన్ననే కాటా బెట్టించి బస్తా ఆరొందలకు షావుకార్ని బతిమాలి తెగనమ్ముకొన్నాం. రేటొత్తదన్న ఆశతో ఎన్నాళ్ళు కడుపులు గట్టుకొంటాం, కావలి కూచుంటాం? సతాయిస్తున్న అప్పులోళ్లను ఏం సముదాయిస్తాం? ఎంతకాలం అవసరాల్ని వాయిదాలతో నెట్టుకెళ్తాం చెప్పు? ధాన్యానికి రేటు రావటం ఏవోగాని అప్పుల మీద వడ్డీలు పెరిగిపోయి అసలకే ఎసరొచ్చేలాగుంది. చూడబోతే పెట్టుబడి దక్కనట్టుంది" యశోదమ్మ.

"ఈ రోజుల్లో ఎగసాయమంటే భూముల్లో పంటలు పండించటం గాదు. పుట్లకొలది దుఃఖాన్ని పండించుకోవటం లాగుంది. చివరకు అప్పులూ, ఆగచాట్లే దక్కుదలనుకోవాలి. రైతు కష్టానికి తగ్గట్టు పంటలకు రేటు కట్టటం లేకపాయె. అందుకే రాను రాను మన రైతులకు ఎగసాయమంటే యిరక్తి బుట్టి పంటభూముల్ని బీళ్లు పెడ్తన్నారు. ఇక ముందు

రైతనేవాడు పంట విరామాలు కాదు. పంటభూముల్నే యిడిచిపెట్టి వెళ్లే గడ్డు రోజులు వచ్చేలాగుంది" భారంగా నిట్టూర్చాడు భూషణం.

ఆ మాట నిజమేనన్నట్లు తలూపింది యశోదమ్మ. ఐదేళ్లుగా కూలిపనివాళ్లు దొరక్క, కూలిరేట్లు భరించలేక, ఎందుకొచ్చిన తిప్పలని చాలమంది రైతులు భూముల్ని కౌలుకిస్తున్నారు. ఇప్పుడు కౌలుదార్లకూ గిట్టక కౌలుసాగుకి భూములు తీసుకునే వాళ్లూ కరువయ్యారిప్పుడు. పట్నంబోయి, చిల్లరమల్లర వ్యాపారాలో, బేలుదారి పనులో చేసుకొంటే ఇంతకన్నా ఎక్కువ కూలి గిడుతుందని రైతుకూలీలు పల్లెటూళ్లోదిలి పట్నాలకు వలసలు బోతున్నారు.

"సీతమ్మ ఎట్టుందయ్యా! దిగుల్నుంచి ఏమన్నా కోలుకొందా?" యశోదమ్మ అడిగింది.

"ఏం కోలుకోటంలే పిన్నాం. ఒంటరిగా వుంటే చాలు. కొడుకుని తల్చుకు తల్చుకు ఏడుస్తుంది" భూషణం.

"పంట నష్టం ఈయేడు గాపోతే పైయేడు పూడ్చు కోగలమన్న ఆశుంటది. కాని, ఈ కడుపు పంట నష్టం అట్టా పూడ్చుకో గలిగింది కాదాయె! ఇలాంటి కడుపు కోత ఏ తల్లికీ రాకూడదు" యశోదమ్మ గొంతు నుంచి సానుభూతి జాలువారింది.

"బిడ్డ చచ్చినా పురిటికంపు పోలేదని, పోలీసోళ్లు కేసులు పెడ్తామంటూ వేపుకు తినటం మొదలెట్టారు. ఎం.ఎల్.ఏ దాకా పోవాల్సి వచ్చింది. అయినా ఎవడు తినాల్సిన గడ్డి వాడు తినిగాని వదిలిపెట్టలేదు" భూషణం మాటల్లో కోపం.

"ఒకడి చావు మరొకడికి పండగంటే ఇదే! లోకం తీరే అట్టుంది" అంది జాలిపడుతూ.

భూషణం కాసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడి, మళ్లీ వస్తాలెమ్మంటూ లేచి వెళ్లాడు.

యశోదమ్మ కళ్లల్లో భూషణం కొడుకు ఈశ్వరయ్య మెదిలాడు.

కాంతయ్య సావాసానికో, పనిముట్ల కోసమో ఆడపాదడపా ఇంటికొస్తూండే వాడు. ఇద్దరూ ఇంటరుగుమీద కూచొని గంటల తరబడి మాట్లాడుకొనేవాళ్లు. ఇంటాయనా వాళ్ల మధ్యలో దూరేవాడు. విత్తనాల గురించి, ఎరువులు, పురుగు మందుల గురించి సలహాలు అడిగేవాడు. అనుమానాలు తీర్చుకొనేవాడు. పిల్లాడి మాటతీరు, పని పట్ల శ్రద్ధా చూస్తుంటే మంచి పద్ధతిగల పిల్లాడనిపించేది. ముప్పై అయిదేళ్లకే నూరేళ్లు నిండాయి. రైతువారీలో అందరికున్నట్టే కష్టాలు, కన్నీళ్లు, పంటనష్టాలు, అప్పులూ. తండ్రిచాటు బిడ్డ. నిలువునా పేణాలు తీసుకునేంత కష్టం ఏమొచ్చింది?

ఈ అనుమానం తనకే కాదు, ఊళ్లో అందరికీ వచ్చింది. తండ్రీ కొడుకుల మధ్య మాట తేడా ఏదో వచ్చుండచ్చనుకొన్నారు. చుట్టుపక్కల వుండేవాళ్లు అలాంటిదేం లేదని తేల్చేశారు. ఈశ్వరయ్య తండ్రి మాట జవదాటడు. భూషణం కొడుకును పన్నెత్తి మాటనడు.

ఈశ్వరయ్య చనిపోయి కొద్ది రోజులయ్యాక ఊళ్లో కుర్రకారు గుసగుసలు క్రమంగా పెద్దల చెవినబడ్డాయి. విత్తనాలకని, పురుగుల మందులకని పట్నానికి బోవటంతో, వ్యభిచారం అలవాటైందని, దాంతో రాకూడని రోగం ఏదో పట్టుకుందని, అది బయటపడ్తే పరువుప్రతిష్ఠలు మంటగలుస్తాయన్న భయంతో చేజేతులా ప్రాణాలు తీసుకొనుంటాడని ప్రచారమైంది.

అందులో నిజమెంతో, అబద్ధమెంతోగాని వయసుమిదిరీ పెళ్లిగాకుండా వున్న కుర్రకారు విషయంలో పెద్దలకు అపనమ్మకాలు మొదలయ్యాయి. రైతువారి కుటుంబాల్లో మగపిల్లలకు సకాలంలో పెళ్లిళ్లు కావటం గగనమైపోయింది. వ్యవసాయదారుడంటే ఇష్టపడి పెళ్లి చేసుకొనే ఆడపిల్లలు కరువైపొయ్యారు. పెళ్లిళ్లు కానంత మాత్రాన వయసుతో పాటు పెరిగే కోరికలు హద్దుల్లో వుంటాయా? అందరూ ఒకేలా నిగ్రహం పాటించగలరా? అందుకు విరుగుడుగా తమ చేతుల్లో మాత్రం మంత్రదండం ఏముంది?

అంతలో పొలం నుండి కాంతయ్య వచ్చాడు. పచ్చగడ్డి మోపు కొష్టంలో పడేసి కాళ్లు, చేతులు, ముఖం కడుక్కొని కండువాతో తుడుచుకొంటూ లోపలకు వచ్చాడు.

"మంచినీళ్లు ఇమ్మంటాయ్యా!" అడిగింది యశోదమ్మ.

"ఆఁ! ఇవ్వమ్మా!" తలకు మించిన బరువుతో వచ్చాడేమో, కంఠంలో కాస్త నీరసం ధ్వనించింది.

యశోదమ్మ చల్లటి కుండనీళ్లు తెచ్చిచ్చింది.

ఎండపాటున తిరిగి తిరిగి వడలిపోయి కందిపోయినట్టున్న కొడుకు ముఖంలోకి చూస్తున్న యశోదమ్మ మనసు వాత్సల్యంతో నిండింది. చిన్నప్పుడు పచ్చగా దబ్బపండులాగుండేవాడు బిడ్డ. ఏళ్ల తరబడి ఎండ దెబ్బకు మాగి మాగి శరీరం నలుపుకి దిరిగి ఎట్టాగైపోయాడు! బడికని పోయిన ఏడెనిమిదేళ్లు నీడపట్టు నుండటంతో నాజూగ్గా దొరబాబులా గుండేవాడు. ఎప్పుడైతే చదవనని మొండికేసి పుస్తకాన్నొదిలి, పనిముట్లు చేతబట్టి పొలం పోవటం మొదలైందో అప్పుడే పిల్లాడిలో మార్పొచ్చింది. చదువు సంధ్యల్లేకుండా పొలం పట్టుకుని తిరగటమేంటని గోల చేసింది.

"ఉజ్జోగం ఎక్కువా, ఎగసాయం తక్కువా అనేంది? ఉజ్జోగమంటే వాడు ఒకరి కింద పని చెయ్యాలి. పదెకరాల పొలముంది మనకు. వాడే పదిమందికి పని జూపిత్తాడే" అంటూ భర్త గొప్పగా సమర్థించాడు.

నీడపట్టున కూచుని దర్జాగా చేసే ఉజ్జోగం, వ్యవసాయం ఒకటెలా అవుద్ది! ఏడాది పొడుగూతా ఎండకు ఎండుతూ, చెమటకు తడుస్తూ, కాయకష్టంతో రాటుదేలిన శరీరాల్లో నాజూకుదనం ఎట్టా కనబడుద్దీ! దక్కే ప్రతిఫలాన్ని బట్టే చేసే పనికి ఈ లోకంలో విలువ కడ్తారు!

"నాన్న ఇంకా రాలేదామ్మా?" అడిగాడు కాంతయ్య.

"లేదురా! మద్దేనం నుండి ఎదురు జూత్తన్నా" చెప్పింది.

భర్త ఏ వేళ కొస్తే నేం, వస్తూ మంచి కబురు తెస్తే చాలు! అలాంటి కబురు కోసమే కొడుకు మనసూ కొట్టుకులాడతందని యశోదమ్మకు తెలుసు. అవతలి వాళ్ల నిర్ణయం బట్టే కాయో, పండో తేలేది. మాలక్ష్మిలా అవతల పిల్లేవన్నా అడ్డం తిరగటం లేదు కదా! సంశయం పీడించటం మొదలెట్టింది.

"పెద్దమ్మా! మేం పుట్టి బుద్ధెరిగిన కాడ్నించి మిమ్మల్ని చూస్తున్నాం. మన్నేమాలోకంగా బతుకుతున్నారు. గానుగెద్దు చాకిరీ దప్ప ఏం సుఖపడ్డారో చెప్పండి. వ్యవసాయంలో దండగన్న మాట తప్ప, లాభం గురించి ఏనాడన్నా మీ నోట విన్నామా! పండగలకీ పబ్బాలకీ నదురైన చీర కొనుక్కొనే దారుందా? ఉన్నవి తెగనమ్ముకోవటమే గాని ఒక కొత్త నగ చేయించుకోగలిగారా? పట్నంలో ఏ పని చేసుకునే వాడైనా కష్టానికి తగినట్టు సంపాదించగలుగుతున్నాడు. అవసరానికి తగినట్టు ఖర్చు పెట్టగలుగుతున్నాడు. రెంటికీ చెడ్డ బతుకులు మనవి. అక్కడ నాలుగిళ్లల్లో పాచిపన్లు చేసుకొనే ఆడోళ్లే మనకన్నా మెరుగ్గా బతుకుతున్నారనిపిస్తంది. పట్నంలో చిల్లరమల్లర వ్యాపారాలు చేసుకొనే వాళ్లు కూడా నెలకు పదేలు సంపాదించగలుగుతున్నారు. పదెకరాల పొలముండి, ఏడాది పొడుగూతా, కష్టపడే రైతుకు ఆ మాత్రం కూలన్నా గిడతుందా? ఏం సుఖపడగలనన్న ఆశతో వ్యవసాయదారుణ్ణి కట్టుకోమంటావు?" అంటూ మాలక్ష్మి మాట్లాడితే నోటమాట రాలేదు.

రైతువారీ సంబంధానికి కూతురు ఇష్టపడటంలేదనీ, సరస్వతి తనదగ్గర వాపోతుంటే, పెద్దరికంగా తనోమాట చెప్పబోయి భంగపడింది. వ్యవసాయమంటే అందరికీ చిన్న చూపు ఏర్పడిపోయింది. ఇటు చూసేవాళ్లకీ, అటు చేసేవాళ్లకీ అన్నిందాల రోతపుట్టి పోయింది. ఆ ఊబిలోంచి బయటపడేదారి వెతుక్కుంటున్నారంతా! ఐదారేళ్లనాటి రుక్మిణికి, ఇప్పుడు మాలక్ష్మికి ఆలోచనల్లో ఎంత తేడా? పెద్దల ఇష్టానికి తగ్గట్లు పిల్లలు నడుచుకొనే రోజులు పోతున్నాయి.

ఐదారేళ్లుగా కొడుక్కి పెళ్లి సంబంధాలు చూస్తున్నా ఎందుకు ముడిపడటం లేదో క్రమంగా అర్థమైంది. తమ కాలంలో పెళ్లిళ్లు ఒక సమస్యగా అనిపించేది కాదు. గంతకు తగ్గ బొంత అన్నట్టుగా అనుకొన్నదే తడవుగా ఎవరిస్థాయికి తగ్గ సంబంధం ఆ స్థాయిలో చూసుకునే వాళ్లు. కాంతయ్య విషయంలో పట్టుమని పది సంబంధాలు రాలేదు. పిల్ల నచ్చలేదని, వయసు తేడా ఎక్కువని, కుటుంబ పద్ధతులు బాగోక రకరకాల కారణాల వల్ల ఏ ఒక్క సంబంధం ఖాయపర్చుకోలేకపోయారు. పదెకరాల పొలం, కొంపా గోడు, గొడ్డు గోదా వుండీ ఏదో పిల్ల, అసలు పెళ్లయితే చాలనుకోవాల్సిన గతి పట్టింది చివరకు.

పదిరోజుల క్రితం ఊరెళ్లి పిల్లను జూసొచ్చారు. పద్ధతిగల కుటుంబం. నాలుగెకరాల పొలం వుంది. ఒక్కతే కూతురు, కొడుకూనూ. గుణవంతురాలు. పనీపాటలు తెలిసిన పిల్ల. ఒడ్డూ పొడుగూ, ముక్కూ మొఖం బాగానే వుందనిపించింది. పిల్లాడూ చూస్తూనే ఇష్టపడ్డాడు. ఆలస్యం చెయ్యకుండా తమవైపు నుండి అభ్యంతరం లేదని కబురు పంపారు. అటువైపు నుంచి ఏ కబురూ లేదు. మగపెళ్లి వాళ్లమని బెట్టుకుపోయే పరిస్థితి లేదు. మధ్యవర్తి ద్వారా ఏదోటి తేల్చుకొద్దామని స్వయంగా బయల్దేరి వెళ్లాడు.

నాగయ్య ఇంటికొచ్చేసరికి బాగా చీకటి పడింది. మనిషి ముఖంలో బాగా అలసట కనిపిస్తోంది. వస్తూనే స్నానానికి నీళ్లు తోడమన్నాడు. వెళ్లిన పనేమైందని నిలబెట్టి అడగటానికి యశోదమ్మకు మనసొప్పలేదు. కాంతయ్యకు తండ్రి ఏం కబురు తెచ్చాడోనన్న ఆత్రం లేకపోలేదు. అడగటానికి ఆత్మాభిమానం అడ్డొచ్చింది.

నాగయ్య స్నానం చేసొచ్చి బట్టలు వేసుకొంటుంటే, అన్నం వడ్డించబోతూ ఉండబట్టలేక అడగనే అడిగింది. "ఏందయ్యా, పొద్దుటనగా వెళ్లినోడివి ఇయ్యేలదాకా వున్నావు" అంటూ యశోదమ్మ కదిలించింది.

"కబురూ కాకరగాయ లేకుండా పోతినా! సమయానికి కలవాల్సిన మనుషు లుండొద్దూ" అంటూ కాస్త చిరాగ్గా సమాధానమిచ్చాడు నాగయ్య.

"ఇంతకీ సంబంధం గురించి ఏమన్నారో చెప్పలేదు". ఉత్సుకత ఆపుకోలేక పోయింది.

"పెద్దవాళ్లకు మన సంబంధం బాగా నచ్చింది. కాకపోతే పిల్లే ఒక మెలిక పెడ్తున్నట్టుంది" నాగయ్య.

"ఏందంటా?" యశోదమ్మ.

"పల్లెటూరి కాపురం చెయ్యదట. అబ్బాయి టవున్లో కాపురం పెడ్తానంటే ఈ పెళ్లి జేసుకోవటానికి సిద్ధమేనందట" నాగయ్య మాటలకు యశోదమ్మ అవాక్కయింది.

మొదట్నుంచీ ఈ సంబంధం మీద గంపెడాశతో వుందేమో, యశోదమ్మ గుండెల్లో రాయి పడినట్లయింది. కాంతయ్య ముఖంలోనూ నీలినీడలు కమ్ముకున్నాయి.

"మరేం సమాధానం చెప్పొచ్చా?" అడిగింది హీనస్వరంతో.

"ఇందులో నేను , నువ్వూ చెప్పేదేముంటుంది? వింటూనే వున్నాడుగా నీ కొడుకు. వాడే తేల్చుకోవాలి, సమాధానం చెప్పాలి" అంటూ సమస్య కొడుకు నిర్ణయానికి వదిలేసి, గుడ్లప్ప[illegible]చి చూస్తుండిపోయాడు నాగయ్య.

కాంతయ్య ఏమంటాడోనని చెవులు రిక్కించి, ఊపిరి నిలిపి, ఎదురు చూడసాగింది యశోదమ్మ. ఊహించని పరిణామంతో కాంతయ్య మనస్సులో సంఘర్షణ మొదలైంది.

*(నవ్య, 18.01.2012)*